

చీఫ్ ఇంజనీర్‌కు వినతిపత్రం అందజేస్తున్న శ్రీహరిరావు

సరస్వతీ కాలువ ద్వారా నీటిని విడుదల చేయాలి

• చీఫ్ ఇంజనీర్‌ను కోరిన డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

సోన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ జలాశయం నుంచి సరస్వతీ కాలువ ద్వారా సాగునీటిని విడుదల చేయాలని కోరుతూ హైదరాబాద్‌లో చీఫ్ ఇంజనీర్ (ఈఎన్‌సీ జనరల్) అంజద్ హుస్సేన్‌ను నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు బుధవారం వినతి పత్రం అందజేశారు. నిర్మల్ నియోజకవర్గంలోని నిర్మల్ రూరల్, సోన్, లక్ష్మణచాంద, మామడ మండలాలకు వరప్రదాయిని అయిన సరస్వతీ కాల్వ ద్వారా ఖరీఫ్ సీజన్‌లో నీటిని విడుదల చేసినట్లయితే రైతులు పంటలు సాగుచేసుకుంటారని పేర్కొన్నారు. నీటి విడుదలతో చెరువులు నిండి సాగుకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. స్పందించిన చీఫ్ ఇంజనీర్ గురువారం నుంచి వారబందీ ద్వారా ప్రతీరోజు 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ రైతన్నలు సాగు నీటిని సద్వినియోగం చేసుకొని వ్యవసాయ అధికారులు సూచించిన పంటలు సాగు చేయాలని కోరారు.

డీఎంహెచ్‌ఓ కార్యాలయం నోటీసు బోర్డుపై ప్రొవిజినల్ లిస్ట్

నిర్మల్ రూరల్, ఆగస్టు6 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో ఒప్పంద ప్రతిపాదికన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మూడు వైద్యఅధికారుల పోస్టులు, బస్తీ దవాఖానాలలో రెండు వైద్యాధికారుల పోస్టుల భర్తీకి వెలుబడిన నోటిఫికేషన్ నెంబర్ 1/2025 ప్రొవిజినల్ లిస్టును జిల్లా వైద్యాధికారి కార్యాలయం నోటీసు బోర్డుపైన, సంబంధిత వెబ్‌సైట్ నందు పొందుపరిచినట్లు జిల్లావైద్య, ఆరోగ్యశాఖ అధికారి రాజేందర్ తెలిపారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే తగిన ధ్రువపత్రాలతో ఈనెల 8లోపు కార్యాలయం నందు సంప్రదించాలని తెలిపారు.

అటెండెన్స్ యాప్‌లో మోసం

• పర్యవేక్షణ అధికారి, ఐదుగురు కార్యదర్శులకు నోటీసులు

నర్సాపూర్(జి), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అటెండెన్స్ యాప్‌లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినందుకు పర్యవేక్షణ అధికారి, ఐదుగురు గ్రామ కార్యదర్శులకు నోటీసులు జారీ అయ్యాయి. మండల పంచాయతీ అధికారి (ఎంపీవో) తిరుపతిరెడ్డితోపాటు కుప్టి గ్రామ కార్యదర్శి కృష్ణ, అర్లి(కె) గ్రామపంచాయతీ కార్యదర్శి శిరీష, గొల్లమాడ గ్రామ కార్యదర్శి సంధ్యరెడ్డి, బామ్ని(బి) గ్రామ కార్యదర్శి గంగాజల, తురాటి గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజు అటెండెన్స్ యాప్‌లో ఫొటోలకు బదులుగా గ్యాలరీలోని ఫొటోలను అప్‌లోడ్ చేసినట్లు గుర్తించారు. దీనిపై తీవ్రంగా స్పందించిన జిల్లా అధికారులు వెంటనే వారందరికీ నోటీసులు జారీ చేశారు. ఈ ఐదుగురు కార్యదర్శులకు ఎంపీవో తిరుపతిరెడ్డి పర్యవేక్షణ అధికారిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు కూడా నోటీసులు అందినట్లు ఎంపీవో తిరుపతిరెడ్డి స్వయంగా ధృవీకరించారు. నిబంధనల ప్రకారం ఉద్యోగులు అటెండెన్స్ యాప్‌లో తమ పని ప్రదేశంలోనే ప్రత్యక్షంగా ఫొటో తీసుకుని అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. కానీ వీరంతా గ్యాలరీలోని పాత ఫొటోలను ఉపయోగించినట్లు విచారణలో తేలింది. ఈ చర్య క్రమశిక్షణారాహిత్యంగా భావించి అధికారులు చర్యలకు సిద్ధమవుతున్నారు. ఈ నోటీసులపై వారు ఇచ్చే వివరణ ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని అధికారులు తెలిపారు. గ్రామస్థాయిలో ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు సక్రమంగా అమలు కావాల్సిన సమయంలో ఇలాంటి నిర్లక్ష్యం చేయడంపై ప్రజలు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

పెంబి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని అంగన్‌వాడీ టీచర్ జాను అన్నారు. బుధవారం మండలంలోని తాటిగూడ గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. తల్లిపాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణీలకు శ్రీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లావణ్య, ఆశావర్కర్ ప్రేమలత, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు, తదితరులున్నారు.

ముందస్తు రాఖీ పౌర్ణమి వేడుకలు

ఖానాపూర్, ఆగస్టు6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ క్యాంపు కార్యాలయంలో బుధవారం ముందస్తు రాఖీ పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల మలేషియా జైళ్లలో చిక్కుకుని జాన్సన్ నాయక్ సహకారంతో విడుదలైన బాధితుల కుటుంబ సభ్యులు జాన్సన్‌నాయక్ క్యాంపు కార్యాలయానికి తరలివచ్చి ఆయనకు రాఖీలను కట్టారు. ఆపత్కాలంలో తమకు సోదరునిలా అండగా నిలిచిన జాన్సన్‌నాయక్‌కు రుణపడి ఉంటామని మలేషియా బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. మాజీ ఎంపీటీసీ శనిగారపు రాణి, సహా పలువురు మాజీ మహిళా ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.



జాన్సన్ నాయక్‌కు రాఖీ కట్టేందుకు వచ్చిన మహిళలు



కుంటాలలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులు (ఫైల్)



కొనుగోలు చేసిన ధాన్యాన్ని లారీల్లో తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

బోనస్ మైనస్..!

- సన్న రకం ధాన్యం బోనస్ డబ్బుల కోసం రైతుల పడిగాపులు
- 4483 మంది రైతులకు రూ.12.81 కోట్ల బకాయిలు
- నెలల గడుస్తున్న అందని డబ్బులు
- నిరాశలో రైతులు

నిర్మల్, ఆగస్టు6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం చెల్లించాల్సిన బోనస్ డబ్బులు ఇప్పటివరకు రైతులకు అందకపోవడం విమర్శలకు తావిస్తోంది. సన్నరకం ధాన్యం సాగును ప్రోత్సాహించేందుకు ప్రభుత్వం క్వింటా ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లిస్తామని ప్రకటించింది. దీంతో రైతులు ఈసారి రబీ సీజన్‌కు గానూ పెద్ద ఎత్తున సన్నరకం ధాన్యాన్ని సాగు చేశారు. డీఆర్డీఏ, పీఏసీఎస్, డీసీయంయస్, డీసీసీల ద్వారా దొడ్డు రకం, సన్నరకం ధాన్యాన్ని వేరు వేరుగా కొనుగోలు చేపట్టారు. అయితే జిల్లా వ్యాప్తంగా 351 కొనుగోలు కేంద్రాల ద్వారా 25,623.240 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేశారు. దీనికి సంబంధించి రైతులకు 419.79 కోట్ల రూపాయలను చెల్లించాల్సి ఉంది. ఇప్పటి వరకు రైతులకు 396.22 కోట్ల రూపాయలను చెల్లించారు. అయితే సన్న రకానికి సంబంధించి 58.10 కోట్లను రైతులకు చెల్లించారు. అయితే 12.81 కోట్ల రూపాయల బోనస్ డబ్బులను మాత్రం రైతులకు ఇప్పటి వరకు చెల్లించలేదు. ఈ డబ్బుల కోసం రైతులు అధికారుల చుట్టూ, ప్రజా ప్రతినిధుల చుట్టూ కాళ్ళు అరిగేలా తిరుగుతున్నారు. కొనుగోలు ప్రక్రియ ముగిసి రెండు నెలలు గడుస్తున్నప్పటికి ఇప్పటి వరకు బోనస్ డబ్బుల చెల్లింపు వ్యవహారం హామీలకే పరిమితమవుతున్నా రైతులకు మాత్రం నగదు అందడం లేదు.

351 కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ

జిల్లాలో మొత్తం 351 కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి సన్న, దొడ్డు రకాలను కలిపి 1,80,945.080 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. డీఆర్డీఏ ఆధ్వర్యంలో 173 కొనుగోలు కేంద్రాలకు గాను 86523.680 మెట్రిక్ టన్నుల ధాన్యం, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 149 కేంద్రాలకు గాను మొత్తం 87,555.840 మెట్రిక్ టన్నులు, డీసీఎంఎస్ ఆధ్వర్యంలోని 24 కేంద్రాల ద్వారా 5257.680 మెట్రిక్ టన్నుల, డీసీసీ ఆధ్వర్యంలో 5 కేంద్రాలకు గాను 1607.880 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. మొత్తం 42,032 మంది రైతులు దొడ్డు, సన్న రకం ధాన్యాన్ని విక్రయించారు.

బోనస్ డబ్బులు 12.81 కోట్ల బకాయిలు

మొత్తం సన్నరకం ధాన్యానికి సంబంధించి 4259 మంది రైతులకు ఇప్పటివరకు 58.10 కోట్లను చెల్లించారు. అయితే ఈ రైతులకు 12.81 కోట్ల బోనస్ డబ్బులు చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం 4483 మంది రైతులు బోనస్ డబ్బుల కోసం ఎదురుచూస్తున్నారు. దొడ్డు రకానికి సంబంధించి 37,549 మంది రైతులకు 360.35 కోట్లను చెల్లించాల్సి ఉండగా దానికి సంబంధించిన డబ్బులను చెల్లించారు. అయితే సన్న రకం ధాన్యానికి సంబంధించి 58.10 కోట్లు చెల్లింపులు జరిపినప్పటికీ బోనస్ డబ్బుల చెల్లింపు విషయంలో ఇప్పటివరకు ఎలాంటి కదలిక కనిపించడం లేదు.

బోనస్ డబ్బులు రూ. 85వేలు రావాలి

• కాల్వ సుధాకర్, రైతు, నర్సాపూర్(జి)

ఈ ఏడాది 170 క్వింటాళ్ల సన్న ధాన్యాన్ని విక్రయించాను. ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించినా ఇప్పటివరకు రైతుల బ్యాంక్ ఖాతాలో జమ చేయలేదు. నేను విక్రయించిన వరికి బోనస్ రూ.85,000 రావాల్సి ఉంది. అధికారులు వెంటనే సన్న రకం వరి ధాన్యం బోనస్ డబ్బులను రైతుల ఖాతాలో జమ చేయాలని కోరుతున్నా.

ప్రోత్సాహంపై భారీగా ప్రచారం

వ్యవసాయ శాఖ అధికారులు సన్నరకం ధాన్యాన్ని సాగు చేసేందుకు విస్తృతస్థాయిలో ప్రచారం చేపట్టింది. సన్నరకం ధాన్యం సాగుపై రైతులకు అవగాహన కల్పించేందు కోసం వ్యవసాయ శాఖ క్లస్టర్‌ల వారిగా రైతుల వేదికల్లో అవగాహన కార్యక్రమాలను చేపట్టింది. దీంతో ఈ సారి జిల్లాలో 25,623.240 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు సాగు చేశారు. జిల్లాలో 4483 మంది రైతులు సన్న రకం ధాన్యం సాగు చేపట్టారు. సన్నరకం ధాన్యం సాగుతో దిగుబడులు కొంత మేరకు తగ్గే అవకాశం ఉన్నప్పటికి బోనస్ డబ్బుల కోసం చాలా మంది రైతులు ఈ పంట సాగుకు ముందుకు వచ్చారు. అయితే అధికారులు ధాన్యం డబ్బులు చెల్లించినప్పటికి బోనస్ డబ్బుల విషయంలో మాత్రం దోబూచులాడుతుండడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రస్తుతం జిల్లాలో 4483 మంది రైతులు బోనస్ డబ్బుల కోసం ఎదురుచూస్తున్నారు. ఖరీఫ్ సీజన్ కొనసాగుతున్నప్పటికీ బోనస్ డబ్బులు రాకపోవడంతో రైతులు పెట్టుబడుల కోసం ఇబ్బందులకు గురవుతున్నారంటున్నారు.



వాల్ పోస్టరనుఉ ఆవిష్కరిస్తున్న వైద్యులు

హెఐవీపై అవగాహన సదస్సు

సోన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం హెచ్ఐవీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతిఒక్కరూ హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి విజయ్‌కుమార్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ జిల్లా పర్యవేక్షకుడు అనిల్‌కుమార్ అన్నారు. హెచ్ఐవీ వ్యాధి సోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వైష్ణవి, సాఫ్ట్ నర్స్ సునీత, డీఎస్ఆర్‌సీ కౌన్సిలర్ శ్రీనివాస్, ల్యాబ్ టెక్నీషియన్ లక్ష్మారెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. ఎఫ్ఐసీటీసీలో హెచ్ఐవీ పరీక్షలకు సంబంధించిన రికార్డులను పరిశీలించి, పరీక్షలు పెంచే విధంగా కృషి చేయాలని సూచించారు.

పెండింగ్ బిల్లులు త్వరలో విడుదల చేయాలి

• జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ రమణారావు

సోన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ పాఠశాలల్లో బుధవారం పీఆర్‌టీయూ యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ రమణారావు మాట్లాడుతూ కేబినెట్ మీటింగ్‌లో హామీ ఇచ్చినట్లు ప్రతీనెల రూ.700కోట్లు ఇస్తాననిచెప్పి, జూన్‌లో కేవలం రూ.180కోట్లు మాత్రమే విడుదల చేశారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం జూన్‌లో ఇవ్వాల్సిన మిగతా 520కోట్లు, జూలైలో ఇవ్వాల్సిన 700 కోట్లు మొత్తం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు చేయకుంటే సెప్టెంబరు 1న ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ సోన్ మండల అధ్యక్షుడు కాలగిరి భూమారెడ్డి, ప్రధానకార్యదర్శి కుంటసాయి కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బీమేశ్వర్, మండల అసోసియేట్ అధ్యక్షులు నగేష్ పాల్గొన్నారు.

'రైతు బీమా రూ.5 లక్షలకు పెంచేందుకు కృషి'

లక్ష్మణచాంద, ఆగస్టు6 (ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్ రైతు బీమా రూ.5 లక్షలకు పెంచేలా కృషిచేస్తామని డీసీసీబీ ఉమ్మడి జిల్లా వైస్ చైర్మన్ ఎర్ర రఘునందన్‌రెడ్డి బుధవారం అన్నారు. మండలకేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో వ్యవసాయ రుణం తీసుకున్న రైతులు గడ్డంశంకర్ (రాచాపూర్), సుంకరి గంగాధర్ (చింతల్‌చందా), పార్‌పెల్లి రఘురెడ్డి (మునిపెల్లి), నాగుల రాజేశ్వర్ (ధర్మారం), చుంచు శివన్న (తిర్‌పెల్లి) మృతిచెందడంతో ఒక్కో కుటుంబానికి రూ.2లక్షల బీమా చొప్పున మొత్తం రూ.10లక్షలను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి పాపారావు, నిర్మల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటల శ్రీనివాస్, జిల్లా సహకార అధికారులు రాజమల్లు, భూమన్న, వైస్ చైర్మన్ సగ్గం వెంకటరాజు, బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్ చైతన్య, డైరెక్టర్లు రైతులు పాల్గొన్నారు.

రైతు కుటుంబాలకు చెక్కులు అందజేస్తున్న దృశ్యం



పాఠశాలల్లో నైపుణ్య అభివృద్ధిపై దృష్టి సారించాలి

» కలెక్టర్ అభిలాష అభినవ్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్



పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటిన కలెక్టర్

నిర్మల్ రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందేలా బోధన కొనసాగించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం నిర్మల్‌రూరల్ మండలంలోని రత్నాపూర్ కాండ్లి గ్రామ ప్రభుత్వ జడ్పీహైస్కూల్‌ను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతులను పరిశీలించి, విద్యార్థుల హాజరుతోపాటు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌ల సరఫరాపై ఆరాతీశారు. విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ వారికి పాఠాలు చదివించడంతో పాటు లెక్కలు చేయించారు. పదో తరగతి విద్యార్థులను ఉద్దేశించి బోర్డు పరీక్షల్లో ఉత్తమ ఫలితాల కోసం ఇప్పటినుంచే పకడ్బందీగా సన్నద్ధమవ్వాలని సూచించారు. విద్యార్థులు రూపొందించిన భారతదేశ భౌగోళిక పటాన్ని పరిశీలించి మెచ్చుకున్న కలెక్టర్, ప్రతీ పాఠశాలలో ఇలాంటి పటాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులకు స్వయంగా భోజనం వడ్డించారు. నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని ప్రతీరోజు అందించాలని అన్నారు. వంటకు కట్టెల పొయ్యి బదులుగా ఎల్‌పీజీ వాడాలని సూచించారు. ఆరో తరగతి విద్యార్థిని అక్షయ కలెక్టర్ ఫొటో ఆధారంగా గీసిన బొమ్మను అందించగా ఆమెను అభినందించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి నీరు పోసిన కలెక్టర్, వాటి సంరక్షణలో విద్యార్థుల భాగస్వామ్యం కీలకమన్నారు. కిచెన్ గార్డెన్‌లో విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి కూరగాయల విత్తనాలను నాటారు. అక్కడ పండే కూరగాయలను మధ్యాహ్న భోజనంలో వినియోగించాలని కలెక్టర్ సూచించారు. తనిఖీల్లో జిల్లావిద్యాశాఖ అధికారి రామారావు, తహసీల్దార్ సంతోష్, ఎంపీడీవో గజానన్, ఎంఈవో వెంకటేశ్వర్లు, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్

ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించేందుకే కాంగ్రెస్ ధర్నా

● నిర్మల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు రితేష్ రాథోడ్

నిర్మల్‌టౌన్, ఆగస్టు6 (ఆంధ్రజ్యోతి): ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించేందుకే కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో ధర్నా చేస్తోంది తప్ప బీసీల కోసం కాదని నిర్మల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు రితేష్ రాథోడ్ పేర్కొన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కామారెడ్డి డిక్లరేషన్‌పై కాంగ్రెస్ మాట తప్పిందని అన్నారు. మైనారిటీ ఓట్ల కోసం ముస్లిం డిక్లరేషన్‌ను అమలు చేయాలనుకుంటోందని ఆరోపించారు. కాంగ్రెస్ ధర్నాకు బీసీల మద్దతు కరువైందని ఎద్దేవాచేశారు. కాంగ్రెస్‌పార్టీ చేపట్టిన ధర్నా అసలైన ఉద్దేశం బీసీల హక్కుల పరిరక్షణ కాదని, ముస్లిం రిజర్వేషన్ల కోసమేనని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ల నెపం కేంద్రంపై మోపి తప్పించుకునే ప్రయత్నాన్ని బీసీ సామాజిక వర్గాలు చూస్తూ ఊరుకోవని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్, అంజు కుమార్ రెడ్డి, మేడిసెమ్మె రాజు, సామ రాజేశ్వర్‌రెడ్డి, రాచకొండ సాగర్, తదితరులు పాల్గొన్నారు.

సార్ యాదిలో..

• జిల్లావ్యాప్తంగా ప్రొ. జయశంకర్ జయంతి వేడుకలు



ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న దృశ్యం

నిర్మల్‌టౌన్, ఆగస్టు6 (ఆంధ్రజ్యోతి): ఆచార్య జయశంకర్ 90వ జయంతి వేడుకలను జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులతో కలిసి జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం పరితపించిన గొప్ప వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, సీపీవో జీవరత్నం, బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, ఏవో సూర్యారావు, డీఐఈవో పరుశురాం, మెప్మా పీడీ సుభాష్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భైంసా: తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో ప్రొ.జయశంకర్ పాత్ర కీలకమని భైంసా గోపాల్‌రావ్ పాటిల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కర్రోల్ల బుచ్చయ్య, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శివరంజనిలు పేర్కొన్నారు. బుధవారం డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో వేర్వేరుగా జరిగిన ప్రొ.కొత్తపల్లి జయశంకర్ జయంతి కార్యక్రమాల్లో మాట్లాడారు.

నిర్మల్ చైన్‌గేట్: కలెక్టరేట్‌లోని జిల్లా ఖజానా కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. అధికారులు ప్రొ.జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీటీవో సరోజ, గజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లాకార్యదర్శి ధాత్రిక రమేష్, అధికారులు శ్యాంసుందర్, రవిచందర్, సుజన్, ఫహీం, విజయ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కుంటాల: తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతిని మండలకేంద్రం కుంటాలలో స్థానిక సృజన విద్యానిలయంలో నిర్వహించారు. తన జీవితాన్ని తెలంగాణకు అంకితం చేసిన గొప్ప పోరాట యోధుడని కొనియాడారు.

కుభీర్: మండల కేంద్రంలోని మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ప్రొ.జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరాజ్, ఎంపీడీవో సాగర్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముథోల్: మండల కేంద్రమైన ముథోల్‌లోని తహసీల్దార్ కార్యాలయం, మండలాభివృద్ధి కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివకుమార్, సూపరింటెండెంట్ అశోక్, ఆర్ఐ నారాయణ పటేల్, సిబ్బంది ఉన్నారు.

నిర్మల్‌రూరల్: పట్టణంలోని జయశంకర్ సార్ సర్కిల్ వద్ద ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజు, బీజేపీటౌన్ అధ్యక్షుడు సుంకరి సాయి, బీజేపీ జనరల్ సెక్రటరీ గిల్లీ విజయ్, శ్రావణ్, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే టౌన్‌ప్రెసిడెంట్ మారుగొండ రాము, కొరిపెల్లి రాంకిషన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ యు. సుభాష్‌రావు, జీవన్ రెడ్డి, గంద్రత్ రమేష్, కాజా అక్రమ్ అలీ, నజీరుద్దీన్, మసూద్ అలీ ఖాన్ పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో..

జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు నిర్వహించినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐలు రామ్‌నిరంజన్ రావు, రామకృష్ణ, రమేష్, శేఖర్, ఏవో యూనస్ అలీ, డీపీవో సిబ్బంది, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పించిన మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి..

పట్టణంలోని జయశంకర్ సర్కిల్‌లో జయశంకర్ విగ్రహానికి మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ధర్మాజీగారి రాజేందర్, ముడుసు సత్యనారాయణ, మేడారం ప్రదీప్, శ్రీకాంత్ యాదవ్, కొప్పుల శ్రీధర్, కోటగిరి అశోక్, పాకాల రామచందర్, శ్రీధర్‌చారి, ప్రభాకర్ చారి పాల్గొన్నారు. అలాగే జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకోజి కిషన్, మున్సిపల్ కమిషనర్ జగదీష్ గౌడ్, బీజేపీ ప్రధాన కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్: ఎంపీడీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో అరుణ రాణి, ఎంపీవో గోవర్ధన్, తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్, తదితరులున్నారు.



కుభీర్‌లో జయంతి వేడుకలు నిర్వహిస్తున్న అధికారులు



భైంసాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జయశంకర్ చిత్రపటం నివాళులర్పిస్తున్న అధ్యాపక బృందం

జయశంకర్ సేవలు మరువలేనివి


సిరికొండలో నివాళులర్పిస్తున్న తహసీల్దార్

బజార్‌హత్నూర్,ఆగస్టు6(ఆంధ్రజ్యోతి):తెలంగాణ ఉద్యమ కెరటం తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలను మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం,ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. .అనంతరం తహసీల్దార్ శ్యాంసుందర్ మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సునీల్, డిప్యూటీ తహసీల్దార్ హీరాలాల్, మహేందర్ నాథ్, నూర్‌సింగ్, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేరడిగొండ :మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్ పాల్గొన్నారు.

సిరికొండ : తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ భావజాల వ్యాప్తి కోసం తన జీవితాన్ని అర్పించిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని తహసీల్దార్ తుకారాం అన్నారు. బుధవారం పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రో. జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్, ఎంఈవో సునీల్, ఎస్ఓ సంధ్యారాణి, డిప్యూటీ తహశీల్దార్ ఉపేందర్, ఎంపీవో సంతోష్, ప్రజాప్రతినిధులు, తదితరులు ఉన్నారు.

మావల : గొప్ప వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ అని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో గల జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల నాగరాజు, అసెంబ్లీ ఉపాధ్యక్షులు సామ రూపేష్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ అట్ల గోవర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు నలిమేల నవీన్ రెడ్డి, మర్సకోళ్ల గౌతమ్, సురేష్ కుమార్, అశోక్, వసీం పాల్గొన్నారు.

ఇచ్చోడ : తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రో. జయశంకర్ చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం ఇచ్చోడ మండల కేంద్రంలో ప్రభుత్వ డీగ్రి కళాశాల, ముక్రా(కె) గ్రామంలో జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్‌శ్రీనివాస్, ముక్రా(కె) పాల్గొన్నారు.

బోథ్ : మండలంలో బుధవారం జయశంకర్ సార్ జయంతి వేడుకలను ప్రభుత్వ కార్యాలయంలో జరుపుకున్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ అంజయ్య ఎంపిఈఓ, అతుల్ కుమార్, పలువురు నాయకులు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

తలమడుగు : తెలంగాణ సిద్ధార్థ కర్త, ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి వేడుకలను బుధవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉన్నారు. అదేవిధంగా జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎంఈఓ వెంకట్రావు, ఉపాధ్యాయులు వినోద్ రెడ్డి, రుయాడిలోని జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బల్దియాలో.. అలజడి

(5వ పేజీ తరువాయి...)

అక్రమ భాగోతం బయటపడే అవకాశం ఉంటుంది.

మరి కొంత మందిపై వేటు?

త్వరలోనే మరి కొంత మంది అధికారులపై వేటుపడే అవకాశం కనిపిస్తుంది. పలు కేసుల్లో హస్తం ఉన్న మున్సిపల్, రెవెన్యూ, సబ్ రిజిస్టర్ శాఖల అధికారులపై పోలీసుల విచారణ కొనసాగుతుంది. ఇప్పటికే పలువురు భూకబ్జా దారులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపించారు. అధికారులు కూడా అక్రమాలకు పాల్పడినట్లు రుజువైతే వేటు వేసే అవకాశం కనిపిస్తుంది. తాజాగా మున్సిపల్ శాఖ అధికారిపై సస్పెన్షన్ వేటు వేయడంతో రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ శాఖల అధికారుల్లోనూ ఆందోళన కనిపిస్తుంది. విలువైన భూములకు సంబంధించిన పత్రాలను పరిశీలించకుండానే గుడ్డిగా రిజిస్ట్రేషన్‌లు చేయడం ఆమోదం తెలపడం వెనుక కోట్ల రూపాయలు చేతులు మారినట్లు తెలుస్తోంది. నిషేధిత జాబితాలో ఉన్న ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్ చేయడం, నకిలీ ఎన్‌వోసీలను జారీ చేయడం లాంటి అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకునేందుకు రాష్ట్రస్థాయి అధికారు లు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో అడ్డగోలు పనులు చేసిన అధికారులపై వేటు వేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతుంది.

రామాయిసబ్‌సెంటర్‌లో ఇమ్యూనైజేషన్ కార్యక్రమం

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు6 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రామాయి సబ్‌సెంటర్ యందు యూనివర్సల్ ఇమ్యూనైజేషన్ ప్రోగ్రాంలో భాగంగా ఏరియా హెల్త్ సూపర్‌వైజర్ బొమ్మెత సుభాష్ హాజరై తల్లిపాల ప్రాముఖ్యత గుర్చి వివరించారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు తాపడం ఎంతో ఆరోగ్యకరమని, అలాగే తల్లికి కూడా ఎంతో మంచిదని అన్నారు. కార్యక్రమంలో పల్లవి మునిగెల, ఎంఎల్‌పీ హెచ్ ఆరోగ్య కార్యకర్తలు వడ్డారపు లలిత, మమత ప్రేమ్‌సింగ్, పవర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరడిగొండ : అప్పుడే పుట్టిన పసిపిల్లలకు తల్లి పాలు ఎంతో శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. బుధవారం తల్లి పాలవారోత్సవాలలో భాగంగా మండలంలోని వడూర్ గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ఆవశ్యకత, ప్రయోజనాలపై సూపర్‌వైజర్ మంజుల గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు.

లబ్ధిదారుల సమస్యను పరిష్కరించాలి

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు బిల్లులు చెల్లించడంలో నిర్లక్ష్యం వహించకుండా వారి ఇబ్బందులను పరిష్కరించాలని సీపీఎం నాయకులు లంక రాఘవులు డిమాండ్ చేశారు. స్థానికంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని లబ్ధిదారులు ఇప్పటికే పునాది కట్టుకుని సంబంధిత అధికారులకు ఫొటోలు పంపినా బిల్లులు చెల్లించడం లేదన్నారు. జిల్లా కలెక్టర్‌తోపాటు అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

అవయవదానానికి ముందుకు రావడం అభినందనీయం

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఆపత్కాల సమయంలో అవయవాలు లభించక అనేక మంది బాధితులు ప్రాణాలు కోల్పోతున్నారని, అవయవ దానంపై యువత అవగాహన కలిగి ఉండాలని మాజీ మంత్రి జోగురామన్న సూచించారు. పట్టణానికి చెందిన గజేందర్ నాయుడు జయంతిని పురస్కరించుకుని బుధవారం స్థానిక రవీంద్ర నగర్‌లో ఆయన సోదరుడు గణేష్ నాయుడు ఆధ్వర్యంలో మెగా అవయవ దాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

జీవ నియంత్రణ సాధనలను ఉపయోగిద్దాం

నేరడిగొండ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జీవ నియంత్రణ సాధనాలను ఉపయోగిద్దాం సాగు ఖర్చును తగ్గించుకుందామని వైల్డ్ వెబ్ ఫండ్ ప్రొడ్యూస్ యూనిట్ మేనేజర్ వంశీ అన్నారు. బుధవారం మండలంలోని యాపాల్‌గూడ గ్రామంలో రైతులకు వ్యవసాయంలో చీడపీడలు ఆశించడం వలన జరిగే పంటనష్టం పై అవగాహన, వావిలాకు కాషాయం తయారీ విధానం పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఫెసిలేటర్‌లు విస్లావత్ రవీందర్, ఇందల్ జాదవ్, రైతులు పాల్గొన్నారు.

నవోదయ పాఠశాలకు ఎంపికైన గిరిజన విద్యార్థి

బోథ్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కంటేగా గ్రామానికి చెందిన నైతం సాయి దీపక్ నవోదయ పాఠశాలకు ఎంపిక కావడంతో గ్రామస్తులు పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం ఘనంగా సన్మానించారు. మారుమూల గ్రామం నుండి విద్యార్థి ఎంపిక రావడం గర్వించదగ్గ విషయమని ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు.

సమస్యలు తెలుసుకోవడానికే యాత్ర

ఉట్నూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జనహిత పాదయాత్ర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకోవడానికి అని, ప్రతిపక్ష పార్టీలు రాజకీయ అక్కసుతో జనహిత పాదయాత్రను విమర్శించడం విచారకరమని జైనూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బానోత్ జైవంత్ రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనహిత పాదయాత్ర విజయవంతం కావడంతో బీఆర్ఎస్, బీజేపీ నాయకులకు మింగుడు పడక ఆరోపణలు చేస్తున్నారన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ జగదీష్ జాదవ్, రాజేష్ నాయక్, రాథోడ్ ప్రకాష్, జాదవ్ రాహుల్ పాల్గొన్నారు.

ప్రాణం కాపాడిన అత్యవసర సేవా సిబ్బంది

ఇచ్చోడ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): సరైన సమయంలో 108 వాహనంలో చికిత్స అందిస్తూ ఆదిలాబాద్ ఆసుపత్రికి తీసుకెళ్లి మెరుగైన చికిత్స అందించి యువకుడి ప్రాణాలను నిలబెట్టారు. అత్యవసర సేవ సిబ్బంది. స్థానికుల వివరాల ప్రకారం.. ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన సతీష్ మంగళవారం రాత్రి ఆత్మహత్యయత్నానికి పాల్పడగా.. గమనించిన కుటుంబసభ్యులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేయగా వేంటనే స్పందించిన సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని చాకచాక్యంగా వ్యవహరించిన ఈఎమ్‌టీ అనిల్ గొంతు చుట్టూ శ్రీకాలర్ అప్లై చేశారు. అనంతరం ఆక్సిజన్ అందించి వైద్యులు ఈఆర్‌సీపీ మౌనిక సూచనతో ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. సకాలంలో చికిత్స అందడంతో ప్రాణాలు దక్కాయి.

స్ట్రాంగ్‌రూమ్ పరిశీలించిన జడ్పీ సీఈవో

ముథోల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో స్ట్రాంగ్ రూమ్, లెక్కింపు కేంద్రానికి ముథోల్‌లోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను బుధవారం జడ్పీ సీఈవో గోవింద్ నాయక్ పరిశీలించారు. పాఠశాలల్లోని పలు గదులను, అలాగే పాఠశాల ఆవరణ తదితర వాటిని పరిశీలించి, పలు వివరాలను ఎంపీడీవో శివ కుమార్‌కు, ప్రిన్సిపాల్ నరసింహ రెడ్డిలకు అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్ట్రాంగ్ రూమ్, లెక్కింపు కేంద్రం కొరకై గురుకుల పాఠశాల పరిశీలించానని సీఈవో తెలిపారు. సంబంధిత వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోలు సుధాకర్, శివ కుమార్, సూపరింటెండెంట్ అశోక్, తదితరులు ఉన్నారు.

ఆలయ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న బోథ్ ఎమ్మెల్యే

నేరడిగొండ , ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజురా గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ ఆలయంలో బుధవారం రాతి ద్వారా (ధర్వజ) ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. ప్రతిష్ఠ గల మహాబలేశ్వరం రాతితో ఏర్పాటు చేసిన ద్వారాలను ప్రతిష్ఠాపించారు. ఈ కార్యక్రమంలో జాదవ్ గణేష్, సవాయిరాం, వసంత్, సుధీర్‌రెడ్డి, రాహుల్ తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

ఉట్నూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి పౌరుడు కృషి చేయాలని మండలంలోని హస్నాపూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుపతి అన్నారు. బుధవారం హస్నాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా, హస్నాపూర్ యువజన సంఘాలు , పాఠశాల సిబ్బంది, విద్యార్థుల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అన్నాభావ్ సాఠే యువజన సంఘ అధ్యక్షులు గవాలె సతీష్, రాందాస్, విష్ణుదాస్, రవిదాస్, పృథ్వీరాజ్,స్వామి వివేకానంద యువజన సంఘం అధ్యక్షులు జాదవ్ విశ్వనాథ్, ఉపాధ్యాయులు అజయ్ పవార్, మెస్రం రవీందర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలో ప్రతిభ

ఉట్నూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజులుగా హనుమకొండలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో ఉట్నూర్ ఐటీడీఏ ఆదర్శ క్రీడా పాఠశాల విద్యార్థి నగేష్ కాంస్య పతకం అందుకున్నారని గిరిజన సంక్షేమ శాఖ జిల్లా క్రీడల అధికారి కో రెడ్డి పార్థసారధి, ఫిజికల్ డైరెక్టర్ జాదవ్ హేమంత్ నాయక్ తెలిపారు. నాలుగు, ఐదు తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదేశాల మేరకు క్రీడాకారులను పంపించామన్నారు. లాంగ్ జంప్ పోటీలలో నగేష్ గతంలో కూడా రాష్ట్రస్థాయి పతకాలు సాధించగా జాతీయస్థాయిలో పోటీల్లో పాల్గొన్నదన్నారు. కాంస్య పథకం సాధించిన గిరిజన విద్యార్థి నగేష్‌ను మరింత ప్రోత్సహిస్తామని, కాంస్య పథకం సాధించి రాష్ట్రస్థాయిలో ఐటీడీఏ ఉట్నూర్ పేరు నిలబెట్టారని విద్యార్థి ప్రతిభ ను జిల్లా క్రీడల అధికారి కొనియాడారు.

ఆటో బోల్తా : పలువురికి గాయాలు


బోల్తా పడిన ఆటో

కుంటాల, ఆగస్టు, 6 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంలోని దౌనెల్లి తాండా సమీపంలో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాల ప్రకారం ఎస్ఐ అశోక్ కథనం మేరకు మహారాష్ట్ర దత్తనగర్ తాండా నుండి మండల కేంద్రం కుంటాలకు వరి నాట్లు వేసేందుకు కూలీలను తీసుకొని వస్తున్న ఆటో దౌనెల్లి తాండా సమీపంలో ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా పడింది. ఇందులో ప్రయాణిస్తున్న ప్రయాణీకుల్లో ఎనిమిది మందికి తీవ్రగాయాలయ్యాయి. మరొకరు ఇందల్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. గాయాలపాలైన ఎనిమిది మందిని నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి త రలించారు. ఇందల్ అనే వ్యక్తి పరిస్థితి తీవ్రంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలు


మిఠాయిలను పంచుకుంటున్న నాయకులు


రోగులకు పండ్లను పంపిణీ చేస్తున్న నాయకులు

కుభీర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ మాజీ ఎమ్మెల్యే గడ్డిగారి విఠల్‌రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం మండల కేంద్రమైన కుభీర్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వివేకానంద ఎక్స్‌రోడ్డు వద్ద పెద్దఎత్తున బాణాసంచాను పేల్చారు. ఏఎంసీ చైర్మన్ కళ్యాణ్, మాజీ ఏఎంసీ చైర్మన్ కందూర్ సంతోష్, నాయకుడు విజయ్‌కుమార్, కేక్‌ను కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్‌ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చవాన్ శంకర్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ రాములు, నాయకులు రాహూఫ్, జావీద్‌ఖాన్, బంక ఆనంద్, సూది రాజన్న, డా. పెంటాజీ, నాగలింగం, అరుణ్, మహిపాల్‌రెడ్డి, దత్తురాంపటేల్ పాల్గొన్నారు.

కుంటాల : ముథోల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం కల్లూర్‌లో నిర్వహించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ సర్పంచ్‌లు రమణ గౌడ్, ఖదీర్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేష్, నాయకులు సునీల్ రెడ్డి, డాక్టర్ బోజన్న, పురుషోత్తం, సోషల్ మీడియా జిల్లా నిర్వాహక అధ్యక్షులు మల్లేష్ గౌడ్, పాలెపు సాయినాథ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

తానూర్ : మండల కేంద్రం తానూర్‌లో బుధవారం మాజీ ఎమ్మెల్యే గడ్డిగారి విఠల్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, పీఏసీఎస్ చైర్మన్ నారాయణ్‌రావుపటేల్ ఆధ్వర్యంలో నాయకులు కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

గోమాతల సంరక్షణకు చర్యలు చేపట్టాలి

● హిందు సంఘాల డిమాండ్

భైంసా, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో చోటు చేసుకుంటున్న గోమాతల హత్యా కాండలు, చోరీ ఘటనల నిరోధానికి పకడ్బందీ చర్యలు చేపట్టాలని పలు హిందూ సంఘాలు ప్రభుత్వానికి డిమాండ్ చేశాయి. సంబంధిత విషయంలో బుధవారం భైంసాలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో గో సంరక్షణ సమితి,హిందూవాహిని, విశ్వహిందూ పరిషత్ శ్రేణులు సంయుక్తంగా విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇందులో గో సంరక్షణ సమితి విభాగ్ ప్రముఖ్ నూకల సురేష్, హిందూవాహిని యువ విభాగ్ రాష్ట్ర ప్రముఖ్ చింతపండు మహేష్, వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షులు పెరుగు నవీన్‌లు మాట్లాడుతూ ప్రభుత్వం పోలీసు అధికార యంత్రాంగం గోమాతల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో హిందూవాహిని జిల్లా సహ సంయోజక్ పల్సి రాజు, భైంసా టౌన్ సంయోజక్ వినాయక్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువును అలవర్చుకోవాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామరావు పటేల్


నృత్యాలు చేస్తున్న విద్యార్థినిలు

● ముథోల్ ఎమ్మెల్యే రామరావు పటేల్

కుంటాల, ఆగస్టు, 6 : (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన చదువును అలవర్చుకోవాలని ముథోల్ ఎమ్మెల్యే రామరావు పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రం కుంటాలలో స్థానిక ఆదర్శ మోడల్ పాఠశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని తల్లిదండ్రుల ఆశయాలను సాధించేందుకు కృషి చేయాలని చదువుతో పాటు క్రమశిక్షణను అలవర్చుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి తమ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు తల్లిదండ్రుల ఆశయాల మేరకు ముందడుగు వేయాలన్నారు. నేటి సమాజంలో విద్యార్థులు చదువుతో పాటు బాల్యం నుండే భక్తి భావన అలవర్చుకోవాలని, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వాలు ఆదర్శ పాఠశాలలు ఏర్పాటు చే శాయని ఈ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు సమిష్టి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా ప్రతిరోజు వివిధ గ్రామాల నుండి వస్తున్న విద్యార్థులకు ఒకబస్సు సరిపోవడం లేదని, ఉదయం సాయంత్రం రెండు రెండు బస్సులు ఏర్పాటు చేయాలని, పాఠశాల ప్రారంభం నుండి హాస్టల్ వరకు సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని, పాఠశాలలో నెలకొని ఉన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని దృష్టికి తీసుకెళ్లగా అందుకు సానుకూలంగా స్పందించిన ఆయన త్వరలోనే సమస్యలన్నింటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కుంటాల ఆదర్శ పాఠశాలలో 723 మంది విద్యార్థులు ఉన్నారని, ముథోల్ నియోజకవర్గంలో అతి పెద్ద పాఠశాల అని పాఠశాల అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ సురేఖ, మండల మాజీ ఉపాధ్యక్షులు పసుల మౌనిక నవీన్, ప్రిన్సిపల్ రాజు, నవీన్, విశ్రాంత ఉద్యోగులు రమేష్ గౌడ్,తహసీల్దార్ కమల్ సింగ్, పాఠశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.

బస్సులో పంచాయతీ

● ఆధార్ కార్డు అప్డేట్ లేదని కండాక్టర్ అభ్యంతరం


కండక్టర్‌తో గొడవపడుతున్న మహిళలు

భైంసారూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఆధార్ కార్డు అప్డేట్ లేదని, ఫ్రీ టికెట్ విషయంలో అరగంట పంచాయతీ జరిగిన ఘటన భైంసా మండలంలో చోటు చేసుకుంది. భైంసా నుంచి నిజామాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సులో దాదాపు 20 మంది మహిళలు ప్రయాణించగా, ఆధార్ చూపించి ఫ్రీ టికెట్ అడిగిన మహిళలకి ఆధార్ కార్డుల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉం దని, అట్టి మహిళలకు కండక్టర్ టికెట్ ఇవ్వలేదు. దీంతో భైంసా మండలం దేగామ్ గ్రామం వద్ద బస్సును అరగంట పాటు ఆపి కండక్టర్‌తో మహిళలు గొడవకు దిగారు. దాదాపు అరగంట సేపు బస్సు రోడ్డు మీద నిలిచి ఉంది.

ఉపాధ్యాయులు లేరని నిరసన


విద్యార్థులతో కలిసి నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

కుభీర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : బడిలో 60 మంది విద్యార్థులకు గాను ఒక్కరే టీచర్ ఉన్నారని బుధవారం మండలంలోని సాంగ్వీ గ్రామంలో పోషకులు నిరసనకు దిగారు. అనంతరం పాఠశాలకు తాళం వేసి ఉపాధ్యాయులు వచ్చేంత వరకు తెరిసేది లేదని పాఠశాల ముందే బైఠాయించారు. గ్రామస్థులందరు గత కొన్ని సంవత్సరాలుగా ఇద్దరు వాలంటీర్లను ఏర్పాటు చేసుకొని వేతనాలు అందిస్తున్నామని వాపోతున్నారు. ఇప్పటికయిన ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై ఎంఈవో విజయ్‌కుమార్‌కు వివరణ కోరగా ఇద్దరు టీచర్లు ఉండగా ఒకరు మెటర్నిటి లీవ్‌లో ఉన్నారని అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి రామరావు కు విషయం వివరించగా ఒక ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేయాలని చెప్పినట్లుగా వివరించారు.

పెన్షనర్‌ల మహాధర్నాను విజయవంతం చేయండి

బోథ్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని అందుకుగాను పెన్షన్ ఆధ్వర్యంలో మహాధర్నా కార్యక్రమాన్ని ఈనెల 11న ఇందిరా పార్కు వద్ద నిర్వహించనున్నట్లు పెన్షనర్ల సంఘం జిల్లా నాయకులు పేర్కొన్నారు. బుధవారం పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎస్ సుధాకర్ పేర్కొన్నారు. ప్రభుత్వం పదవీ విరమణ పొందిన పెన్షనర్లకు రావాల్సిన బకాయిలు చెల్లించడంలో తీవ్రజాపం జరుగుతుందన్నారు. పదవీ విరమణ పొందిన అనంతరం ప్రభుత్వం ఇచ్చే పెన్షన్లతో జీవించే వారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు.

లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు పంపిణీ

ముథోల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసిన నూతన రేషన్ కార్డులను మండలంలోని చించాల గ్రామంలో పంచాయతీ కార్యదర్శి అమిత లబ్ధిదారులకు బుధవారం అందజేశారు. మొత్తం 61 మందికి నూతనంగా వచ్చిన రేషన్ కార్డులను ఆమె పంపిణీ చేశారు. రేషన్ డీలర్ సర్దార్ ఖాన్, నాయకులు దుడ్డు ప్రసాద్, శివాజీ పాల్గొన్నారు.

ఇండ్ల నిర్మాణం వేగవంతంగా చేయండి

కుంటాల, ఆగస్టు, 6 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో వనజ అన్నారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దత్తురాం, ఏపీవో నవీన్ తదితరులు ఉన్నారు.

మండల నవ సంఘర్షణ సమితి అధ్యక్షుడిగా గంగాధర్

కుంటాల, ఆగస్టు, 6 : (ఆంధ్రజ్యోతి) :మండలంలోని నవ సంఘర్షణ సమితి అధ్యక్షునిగా ఎర్రోల్ల గంగాధర్ నియమితులైనట్లు తెలంగాణ రాష్ట్ర ఎన్ఎస్ఎస్ అధ్యక్షులు గజేందర్ యాదవ్ పేర్కొన్నారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగారాం ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లా అధ్యక్షులు ఫేరోజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దాలమల్క నర్సయ్య కుంటాల మండల అధ్యక్షుడినిఎన్నుకున్నారు.

ఆర్జీయూకేటీ స్పోర్ట్స్, ఎన్‌సీసీ జాబితా విడుదల

బాసర , ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఆర్జీయూకేటీ బాసర, మహబూబ్‌నగర్ కేంద్రాలకు సంబంధించిన స్పోర్ట్స్ ఎన్‌సీసీ కోటా 5వ విడత జనరల్ కోట అభ్యర్థుల జాబితాను విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. దీనికి సంబంధించిన కౌన్సిలింగ్ కోసం ఈ నెల ఆగస్టు 8వ తేది న నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ అధికారులు ప్రకటించారు. కౌన్సిలింగ్ ఉదయం 9గంటలకు ప్రారంభమవుతుందని,సమయానికి కౌన్సిలింగ్‌కేంద్రాలకు హాజరు కావాలని సూచించారు.

అమ్మ పాలే బిడ్డకు అమృతం

భైంసా రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేగాం గ్రామంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు సూపర్‌వైజర్ కవిత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పుట్టిన ప్రతి బిడ్డకు ముర్రుపాలు తాగించడంతో శిశువుకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. ప్రతి గర్భిణీ ఆకుకూరలు, పండ్లు, ప్రోటీన్స్ గల ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. అప్పుడే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షులు సుష్మా, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, బాలింతలు, గర్భిణీలు, తదితరులు పాల్గొన్నారు.

కుంటాల : తల్లిపాలే బిడ్డ ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరమని డీపీవో శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రం కుంటాలలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ విజయలక్ష్మీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వనజ, తహసీల్దార్ కమల్ సింగ్, పంచాయతీ సెక్రటరీ తదితరులు పాల్గొని తల్లిపాల విశిష్టతను పోషకులకు వివరించారు. బిడ్డ పుట్టిన సమయంలో తల్లిపాలను పట్టిస్తే రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అంతేగాకుండా అంగన్వాడీ కేంద్రాలలో ప్రభుత్వ సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణీలు, బాలింతలు సద్వినియోగపరుచుకోవాలన్నారు. ఈ సందర్భంగా పౌష్టికాహారాన్ని ప్రదర్శించారు.

కడెం : మండలంలోని పాండ్వాపూర్ కాశీగూడెంకు చెందిన కనక గిరిజా బాయి అనే గర్భిణీకి పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో 108కి సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది ఈఎన్‌టీ మురళి పైలెట్ వసంతరావు గిరిజా బాయిని ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలో నర్సాపూర్ గ్రామ సమీపం వద్ద గిరిజా బాయి అంబులెన్స్‌లోనే ప్రసవించింది. తల్లిబిడ్డ ఇద్దరు క్షేమంగా ఉన్నట్లు 108 సిబ్బంది తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీదే గెలుపు


ఇంటింటా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

సారంగాపూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ పార్టీ బలపరిచిన అభ్యర్థులే గెలుపొందుతారని బీజేపీ పార్టీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్ అన్నారు. బుధవారం సారంగాపూర్ మండలంలోని కౌట్ల (బి), స్వర్ణ, తండా గ్రామాలలో మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అధిక స్థానాలు గెలుపొందుతాయని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికలను నిర్వహించకుండా 42 శాతం బీసీ రిజర్వేషన్ పేరుతో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించడం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు కాల్వ నరేష్ , నాయకులు రాజేందర్‌రెడ్డి, గంగారెడ్డి, చెన్న రాజేశ్వర్ , వీరయ్య, నర్సయ్య, నారాయణ, గుమ్మల రవి, వెంకటేష్, ఉమేష్, రాజారెడ్డి, ప్రకాష్, నాయకులున్నారు.

నానో యూరియా పెరుగుదల దశలో ఉపయోగించాలి

పెంబి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : నానో యూరియా మొక్కల పెరుగుదల దశలోనే ఉపయోగించాలని జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మ్యాక్స్ సొసైటీలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నానో యూరియా అనేది ద్రవ రూపంలో ఉండే ఒక ఎరువు. ఇది సాధారణ యూరియాకు ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతుందని, మొక్కలకు నత్రజనిని సమర్థవంతంగా అందిస్తుందని, దీని ద్వారా దిగుబడి పెరుగుతుందని, నానో యూరియాలో ఉండే నత్రజనితో సమానమైన పరిమాణంలో నత్రజనిని కలిగి ఉంటుందన్నారు. నానో యూరియా వాటం వలన సాధారణ యూరియా వాడకం తగ్గుతుందన్నారు. నానో యూరియాతో మొక్కలకు నత్రజనిని సమ్మవంతంగా అందిస్తుందని, ఇది పంట దిగుబడిని పెంచడానికి సహాయపడుతుంది. నానో యూరియాను ఉపయోగించే ముందు రైతులు సరైన అవగాహన కలిగి ఉండాలన్నారు.


వాలీబాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

రసవత్తరంగా రాష్ట్రస్థాయి ఖేల్‌కూద్ పోటీలు

● మూడు విభాగాల్లో ఆరు రకాల క్రీడల నిర్వహణ

భైంసా, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలోని కిసాన్‌గల్లి శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఖేల్‌కూద్ పోటీలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ప్రారంభమైన పోటీలు గురువారం ముగియనున్నాయి. మూడు విభాగాల్లో ఆరు రకాల క్రీడలకు సంబంధించి ఆటల పోటీలు కొనసాగుతున్నాయి. కబడ్డీ,వాలీబాల్, ఖోఖో, చెస్, యోగా పోటీలు కిసాన్‌గల్లి పాఠశాల వేదికగా జరుగగా షటిల్ పోటీలు మున్నాలడ్డా ఇండోర్ గ్రౌండ్స్‌లో జరిగాయి.సబ్ జూనియర్,జూనియర్, సీనియర్ విభాగాలుగా పోటీల నిర్వాహణ కొనసాగుతోంది. రాష్ట్రంలోని వివిధ శిశు మందిరాలకు చెందిన వేయి మందికి పైగా క్రీడాకారులు ఖేల్‌కూద్ పోటీల కోసం గాను ఇక్కడకు తరలివచ్చారు. బుధవారం ఇక్కడి కిసాన్ గల్లీ శిశుమందిర్ ప్రాంగణమంతా ఆటగాళ్ళు, వీక్షకులతో నిండిపోయింది. పాఠశాల ఆవరణలో నిర్వహించిన కబడ్డీ,వాలీబాల్, ఖోఖో పోటీలను తిలకించేందుకు వీక్షకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పలువురు ఆటగాళ్ల తమ క్రీడా నైపుణ్యతతో వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోటీలు రాత్రి వరకు పోటాపోటీగా కొనసాగాయి. రాత్రి వేళలో పాఠశాల ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసి వేదికపై నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరారించాయి. గురువారం విజేతలకు బహుమతుల పంపిణీతో ఖేల్‌కూద్ పోటీలు ముగిసిపోనున్నాయి.

మార్కెట్ యార్డులకు స్థల సేకరణ చేయాలి

బోథ్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): బోథ్ మార్కెట్ కమిటీ పరిధిలోని నేరడిగొండ, బజార్‌హత్నూర్ మండలాల్లో సబ్ మార్కెట్ యార్డు ఏర్పాటుకు స్థల సేకరణ చేపట్టాలని మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి బుధవారం ఆదిలాబాద్ ఆర్డీవో స్రవంతికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన ఈ రెండు మండలాల్లో సబ్ మార్కెట్ యార్డు లేకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. మార్కెట్ యార్డు ఉంటే అన్ని రకాల సౌలభ్యం రైతులకు అందుతుందని ఆయన పేర్కొన్నారు.

అనుబంధాల ఆన్‌లైన్ రాఖీ



● రాఖీ పండగ సందర్భంగా విదేశాలకు రాఖీలు పంపేందుకు ఒక కొరియర్ సంస్థ రూపొందించిన కవర్

» విదేశాల్లోని సోదరులకు పంపేందుకు వీలు » అందుబాటులో ఈ కామర్స్ పోర్టల్లు
» ఆన్‌లైన్, పోస్టల్, కొరియర్ సేవల జోరు » కాలానికనుగుణంగా రాఖీల్లో మార్పులు » ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో కార్గో కౌంటర్లు » అందమైన అనుబంధం.. అంతులేని అనురాగం » ఈనెల 9న రాఖీ పండుగ


ఇప్పుడంతా.. డిజిటల్ ట్రెండ్

రాఖీ వ్యాపారంలో డిజిటల్‌గా పెనవేసుకుంటున్న మార్కెట్‌లో జోష్ కనిపిస్తోంది. పూలు, చాక్లెట్లు, గిఫ్ట్ ఐటెమ్స్‌తో కూడిన సంప్రదాయ రాఖీలు నుంచి మోడ్రన్ డిజైన్‌లు వరకు పెద్ద మొత్తంలో అమ్మకాలు జరుగుతున్నాయి. క్యూఆర్‌కోడ్‌లతో రాఖీలు, పర్సనలైజ్డ్ ఫొటో రాఖీలు, బ్రదర్ సిస్టర్ మ్యాచింగ్ బాక్స్‌లు వంటి క్రియేటివ్ ఐటెమ్స్ భలే డిమాండ్‌లో ఉన్నాయి.

భైంసా/ఇచ్చోడ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): అన్నాదమ్ములు, అక్కా చెల్లెళ్ల మధ్య అనుబంధాన్ని పెంచే అద్భుతమైన పండుగ రాఖీ. పండుగ రోజు తన సోదరుడి చేతికి రాఖీ కట్టి.. అన్నివేళల్ల తనకు అండగా నిలవాలని కోరుతారు సోదరీమణులు. సోదరుడు వారి కాళ్లకు నమస్కరించి ఆశీర్వాదాలు తీసుకుంటారు. సోదర, సోదరీ భావానికి ప్రత్యేకమైన ఈ రాఖీ పండుగ ఆనందాలను ఏ ఒక్కరు మిస్సవకుండా పలు సంస్థలు రాఖీల బట్వాడాకు అవకాశం కల్పించాయి. విదేశాలలో ఉన్న సోదరులకు కూడా రాఖీలు అదే రోజు అందజేసే ఏర్పాట్లు చేశారు. అక్కా, చెల్లెమ్మలకు చేయాల్సిందల్లా ఆయా వెబ్ సైట్లలోకి వెళ్లి క్లిక్‌మని ఆర్డర్ చేయడమే..

పండుగకు ప్రత్యేక ఆఫర్లు

ఈ కామర్స్ వెబ్‌సైట్లు(అమేజాన్, ఫ్లిప్‌కార్ట్, ఐజీపీ, రాఖీ.కామ్) రాఖీ పంపిణీకి ప్రత్యేక ఆఫర్లు ప్రకటించాయి. ఇండియాలోనే కాకుండా అమెరికా, కెనడా, యూకే, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో ఉన్న సోదరులకు రాఖీలు, గిఫ్ట్ హ్యాంపర్లు పంపుతున్నారు. గ్లోబల్ డెలివరీ పేరుతో ప్రత్యేక చార్జీతో పండుగ పండుగరోజే అందజేయనున్నట్లు కొన్ని కంపెనీలు ప్రటించాయి. కొన్ని సంస్థలు తక్కువ ఖర్చుతో రాఖీ ఓన్లీ డెలివలీ అనే ఎంపికను కూడా అందిస్తున్నాయి.

సరిహద్దుల్లోని అన్న కోసం..



ఇచ్చోడ మండలంలోని ముక్రా(బి) గ్రామానికి చెందిన పాన్‌పట్టే వజ్రేశ్వరీ డిగ్రీ చదువుతోంది. ఆమె సోదరుడు పాన్‌పట్టే సాయితేజ ఇటీవలే ఆర్మీ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ప్రస్తుతం మధ్యప్రదేశ్‌లో విధులు నిర్వహిస్తున్న అన్నకు, యేటా ఇంటి వద్దే రాఖీ కట్టే చెల్లెలు ఈ ఏటా అన్నకు ఏలా రాఖీ కట్టాలని ఆలోచించింది. కొరియర్ ద్వారా రాఖీ, మిఠాయిలు పంపించింది. దగ్గర లేడన్న బాధ ఉన్నా.. పంపించిన రాఖీ అన్నయ్యకు చేరుతోందన్న ఆనందాన్ని వ్యక్తం చేసింది.

పోస్టల్ శాఖ ప్రత్యేక సేవలు

పోస్టల్ డిపార్ట్‌మెంట్ కూడా రాఖీ పండుగను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక రాఖీ కవర్లను విడుదల చేసింది. ఈ కవర్లను గాలి, నీరు దుమ్ము తగలకుండా ప్రత్యేకంగా డిజైన్ చేశారు. అతేకాకుండా దేశవ్యాప్తంగా 1-5 రోజుల్లో బట్వాటా చేసేలా స్పీడ్ పోస్టు సేవలను మెరుగుపరిచారు. అంతర్జాతీయ రాఖీ పంపిణీ కోసం ఇంటర్నేషనల్ స్పీడ్ పోస్టు సేవ అందుబాటులో ఉంది. అదేవిధంగా పోస్టల్ రాఖీల కోసం epostoffice.gov.inలో నమోదవ్వాలి.

ఆర్టీసీ, రైల్వే, కొరియర్ సంస్థల వేగం

తెలంగాణ ఆర్టీసీ, రైల్వే పార్సిల్ విభాగాలు చిన్న పార్సిళ్లను వేగంగా రవాణా చేసేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశాయి ముఖ్యంగా ప్రధాన నగరాలు, పట్టణాల నుంచి ఇతర రాష్ట్రాలకు వేగంగా చేరేలా చర్యలు తీసుకుంటున్నాయి. రైల్వే ప్రయాణికులు confirm Tkt, ixigo trains, zoop యాప్‌లో పీఎన్ఆర్ నెంబరు ఎంటర్ చేసి రాఖీ డెలివరీ ఎంచుకోవచ్చు. అంతేకాకుండా బట్వాడా సేవల్లో డీహెచ్ఎల్ ఫెడ్ఎక్స్, బ్లూడార్ట్, డీటీడీసీ వంటి ప్రైవేటు సంస్థలు కూడా విదేశాలకు రాఖీలు పంపించేందుకు ప్రత్యేక ప్లాన్లను ప్రకటించాయి. వీటిలో కొన్ని సంస్థలు డోర్ టూ డోర్ పికప్ అండ్ డెలివరీ సదుపాయాన్ని కూడా అందిస్తున్నాయి.



రాఖీ పంపేందుకు పోస్టల్ శాఖ అందుబాటులోకి తీసుకవచ్చిన కవర్


ఆదిలాబాద్ ఆర్టీసీ బస్టాండులో ఏర్పాటుచేసిన కార్గొ కౌంటర్

బుడి బడి అడుగులు..

» ప్రాథమిక విద్యలో ఇక మరింత పారదర్శకత » నిర్మల్ జిల్లాలో ఇదివరకే నాలుగు ప్రీ ప్రైమరీ స్కూళ్లు » మరో 11 ప్రీ ప్రైమరీ స్కూళ్లకు ప్రభుత్వం అనుమతి » ఒక్కో స్కూల్‌లో చిన్నారులకు మెళకువలు నేర్పేందుకు ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టులు » ఆగస్టు 15లోపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసేందుకు అధికారుల కసరత్తు


● ప్రీ ప్రైమరీ స్కూళ్లలో చిన్నారులకు బోధిస్తున్న ఇన్‌స్ట్రక్టర్


ప్రీ ప్రైమరీ స్కూళ్లలో చదువుకుంటున్న చిన్నారులు (ఫైల్)

ఖానాపూర్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగంలో ప్రీ ప్రైమరీ స్కూల్స్ లేకపోవడంతో బుడిబుడి అడుగులు వేసే చిన్నారులకు సైతం ప్రైవేట్ రంగం వైపు పంపక తప్పని పరిస్థితులను ఎదుర్కొంటున్న తల్లిదండ్రులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. విద్యారంగాన్ని బలోపేతం చేయడంలో భాగంగా ఎన్నో సంస్కరణలు చేపడుతున్న ప్రభుత్వం పూర్వ ప్రాథమిక విద్యపై ప్రత్యేక దృష్టి సారించిందని చెబుతున్నారు. ఇందులో భాగంగానే ఇదివరకే కొన్నిచోట్ల ప్రీ ప్రైమరీ స్కూళ్లను ప్రారంభించిన నేపథ్యంలో ఈ ఏడాది వాటి సంఖ్యను ప్రభుత్వం మరింత పెంచనున్నట్లు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. అందులో భాగంగా నిర్మల్ జిల్లాకు ప్రీ ప్రైమరీ స్కూళ్లు 11 మంజూరైనట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో ప్రభుత్వ విద్యారంగంలో సైతం నాలుగేళ్ల చిన్నారులను పూర్వ ప్రాథమిక విద్య వైపు ప్రోత్సహించేందుకు అధికారులు ఇక చకచకా ఏర్పాట్లను చేస్తున్నారు. నిర్మల్ జిల్లాలో ఇదివరకే నాలుగు ప్రీ ప్రైమరీ స్కూల్స్ నడుస్తున్న నేపథ్యంలో తాజాగా మరో 11 మంజూరవడంతో జిల్లా వ్యాప్తంగా 15 ప్రీ ప్రైమరీ స్కూళ్లు నిర్వహించనున్నారు.

జిల్లాకు 11 ప్రీ ప్రైమరీ స్కూళ్ల మంజూరు

నిర్మల్ జిల్లాలో పూర్వ ప్రాథమిక విద్యను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం 11 ప్రీ ప్రైమరీ స్కూళ్లను మంజూరు చేసినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఇదివరకే జిల్లాలో భైంసా మండలంలోని పేండ్‌పెల్లి, లక్ష్మణచాంద మండలంలోని చామన్‌పెల్లి, నర్సాపూర్(జి) మండలంలోని బూరుగుపల్లితో పాటు కుబీర్ మండల కేంద్రంలో మొత్తం నాలుగు ప్రీ ప్రైమరీ స్కూళ్లు నడుస్తున్నాయి. తాజాగా కడెం మండలంలోని పాండ్వాపూర్, కుబీర్ మండలంలోని బకోట్, కుంటాల మండలంలోని లింబా(బి), నర్సాపూర్(జి) కేంద్రంలో, నిర్మల్ అర్బన్‌లోని నాయుడివాడ, నిర్మల్ రూరల్‌లోని ముజ్గి, భాగ్యనగర్, సారంగాపూర్ మండలంలోని సిరిపల్లి తండా, సోన్ మండలంలోని కూచన్‌పల్లి, తానూర్ మండలంలోని మాసల్గా, బొంద్రాట్ గ్రామాల్లో నూతనంగా ప్రీ ప్రైమరీ స్కూళ్ల ప్రారంభం కానున్నాయి.

ఆగస్టు 15 లోపు పూర్తికానున్న ఏర్పాట్లు

చిన్నారులకు నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ లాంటి ప్రీ ప్రైమరీ విద్యను ప్రభుత్వ రంగంలో అందుబాటులోకి తెచ్చేందుకు జిల్లాలో నూతనంగా ప్రారంభం కానున్న 11 ప్రీ ప్రైమరీ స్కూళ్లకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు ఆగస్టు 15వ తేదీలోపు పూర్తి చేసే దిశగా అధికారులు చేస్తున్నారు. ఒక్కో ప్రీ ప్రైమరీ స్కూల్‌లో చిన్నారులను చూసుకునేందుకు ఒక ఆయా, వారికి మెలకువలు నేర్పేందుకు ఒక ఇన్‌స్ట్రక్టర్ నియమించాలని ప్రభుత్వం నిబంధనలు జారీ చేసిన నేపథ్యంలో ఆయా గ్రామాల్లో ఉన్న స్థానికులకు అవకాశం దక్కనుంది. ఇందుకు గాను ఈ రెండు పోస్టులలో పని చేసేందుకు 18 నుండి 40 సంవత్సరాల మధ్య వయసుకులైన మహిళలను తాత్కాలిక పద్ధతిలో నియమించనున్నారు. ఇన్‌స్ట్రక్టర్ పోస్టు దక్కించుకునే మహిళకు ఇంటర్మీడియట్ అర్హతగా నిర్ణయించగా ఆయా పోస్టుకు దరఖాస్తు చేసుకునే వారికి ఏడవ తరగతిని అర్హతగా నిర్ణయించారు. జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ల ఆధ్వర్యంలో ఇన్‌స్ట్రక్టర్, ఆయాల ఎంపిక జరుగుతుందని అధికారులు చెబుతున్నారు.

చిన్నారులు ఉల్లాసంగా గడిపేలా..

ప్రీ ప్రైమరీ స్కూళ్లకు వచ్చే చిన్నారులు ఉల్లాసంగా గడిపేలా వారికి ప్రత్యేకంగా పాఠశాలలో ఒక గదిని కేటాయించనున్నారు. చిన్నారులకు ఇండోర్, అవుట్ డోర్ క్రీడా సామాగ్రిని ఏర్పాటు చేయనున్నారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీకి అనుగుణంగా రోజువారి హాజరు స్వీకరించి అంగన్‌వాడీల ద్వారా చిన్నారులకు స్నాక్స్‌ను పంపిణీ, మధ్యాహ్న భోజనం అమలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లా స్థాయి కొనుగోలు కమిటీ ఆమోదంతో ఈ ప్రీ ప్రైమరీ స్కూల్‌లలో ఉపయోగించే సరుకులు గాని ఆట వస్తువులను గాని కొనుగోలు చేయనున్నట్లు అధికార వర్గాలు వెల్లడిస్తున్నారు. తల్లిదండ్రులను సైతం భాగస్వామ్యులను చేస్తూ ప్రీ ప్రైమరీ స్కూళ్లను పారదర్శకంగా నడిపేందుకు ప్రభుత్వ అధికారులు అన్నిచర్యలను ముమ్మరంగా చేస్తున్నారు. ఈ ప్రీ ప్రైమరీ స్కూళ్ల ద్వారా చిన్నారుల్లో అక్షరాల గుర్తింపు, తోటి వారితో మెలిగే విధానం, ఆటపాటల్లో అన్ని రకాల మెలకువలను నేర్పిస్తూ ప్రాథమిక విద్య వైపు అడుగులు వేసేందుకు అన్ని రకాల మెలకువలను నేర్పిస్తూ ప్రాథమిక విద్య వైపు అడుగులు వేసేందుకు వారిని మానసికంగా సిద్ధం చేయనున్నారు.

ఆగస్టు 15 లోపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తాం

: పి.రామారావు, జిల్లా విద్యాధికారి, నిర్మల్



నిర్మల్ జిల్లాకు 11 ప్రీ ప్రైమరీ స్కూళ్లు మంజూరయ్యాయి. ఈ స్కూళ్ల ప్రారంభం కోసం ఆగస్టు 15వ తేదీ లోపు అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తాం. జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో ఇన్‌స్ట్రక్టర్, ఆయాల ఎంపిక జరుగుతుంది. ఇదివరకే జిల్లాలో నాలుగు ప్రీ ప్రైమరీ స్కూళ్లు ఉన్నాయి. ప్రస్తుతం 11 మంజూరవడంతో వాటి సంఖ్య 15కు పెరగనుంది. ప్రీ ప్రైమరీ స్కూళ్లను సద్వినియోగం చేసుకోవాలి.

ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడాలి

బోథ్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా నమోదు చేయాలని ఆదిలాబాద్ డిఎల్పిఓ జి. రమేష్ సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఓటర్ జాబితాను సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోతో పాటు కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

కరత్వాడ పాఠశాలలో డీపీవో తనిఖీ

బోథ్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్త కరత్వాడ పాఠశాల బుధవారం ఆదిలాబాద్ డిఎల్‌పిఓ రమేష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. పాఠశాలలు బోధించిన అంశాలను ఏ మేరకు నేర్చుకున్నారని పాఠ్యాంశాలను చదివించారు. ఆయన వెంట ఎంపీడీవో రమేష్, ఎంపీఈవో అఖిల్ కుమార్ తదితరులు ఉన్నారు.


బోథ్-కిన్వాట్ అంతర్రాష్ట్ర రహదారిపై ఏర్పడ్డ గుంతలు

అంతర్ రాష్ట్ర రహదారిపై గుంతలు

బోథ్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలం మీదుగా వెళ్లే అంతర్ రాష్ట్ర రహదారిలో పొచ్చెర నుంచి సోనాల వరకు గుంతలమయంగా మారింది. ఫలితంగా ఈ రూట్‌లో వెళ్లే ద్విచక్ర వాహనాల వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. గత ఆరు నెలల క్రితం గుంతలు పూడ్చినా.. తిరిగి ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు గుంతల మయంగా మారింది. అయితే, గత ఆరు నెలల క్రితం గుంతలు పడ్డ రోడ్డుపై ప్యాచ్ వర్క్ పనులను చేపట్టారు. అయితే ప్యాచ్ వర్క్ పనులు చేపట్టిన చోటనే తిరిగి గుంతలు కావడం జరిగింది. ప్యాచ్ వర్క్ పనులు నాసిరకంగా కొనసాగడం వల్లనే ఆరు నెలల లోపే రోడ్డు గుంతల మాయంగా మారిందని పలువురు విమర్శిస్తున్నారు. అయితే రోడ్డుపై భారీ వాహనాలు వెళుతుండడంతో గుంతలు వెడల్పుగా మారుతున్నాయి. గుంతలు పూడ్చి ఇబ్బందులను తొలగించారని మండల ప్రజలు కోరుతున్నారు. అంతేకాకుండా అంతర్రాష్ట్ర రహదారి పైన ఏర్పడిన గుంతల మూలంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రూట్లో ప్రయాణించే వారికి వర్షం పడితే గుంత ఎక్కడ ఉందో తెలియకుండా పోతుంది. ద్విచక్ర వాహనాలు వెళుతున్న సమయంలో నీటితో నిండిన గుంతల్లో వాహనాలు దిగబడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల పలువురు ఈ రోడ్డుపై ప్రమాదాల బారీన పడ్డారు. అధికారులు ప్రయాణికుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని గుంతలను పూడ్చాలని కోరుతున్నారు.

నిరుద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్

● తెలుగు యువత అధ్యక్షుడు నాగన్న

బోథ్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు నిరుద్యోగులను మోసం చేస్తూ వస్తున్నాయని టీడీపీ ఆదిలాబాద్ పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షుడు గాలిపల్లి నాగన్న విమర్శించారు. బుధవారం బోథ్‌కు వచ్చిన సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యువతను మభ్యపెట్టి మోసం చేయడంలో ఒకరి కంటే ఒకరు ఎక్కువగా ఉన్నారన్నారు. వేలాది మంది యువకులు ఉపాధి కోసం రుణాలకు దరఖాస్తులు చేసుకొని ఉన్నారన్నారు. దీంతో యువకులు నిరాశని గురవుతున్నారని పేర్కొన్నారు. రాజీవ్ యోగవి కోసం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు సమావేశంలో బోత్ తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ ఎం శివారెడ్డి ప్రధాన కార్యదర్శి చందు నాయకులు జి నారాయణ, ఇచ్చోడ మండల కన్వీనర్ బొజ్జ లక్ష్మణ్ ,తలమడుగు సునాల మండల అధ్యక్షులు గంగారెడ్డి, మహబూబ్ గుడిహత్నూర్ మండల అధ్యక్షులు మహేందర్, ఆదిలాబాద్ టౌన్ అధ్యక్షులు తోకల గంగమ్మ, తదితరులు పాల్గొన్నారు


బోథ్‌లో మాట్లాడుతున్న గాలిపల్లి నాగన్న

ఫొటో న్యూస్


గాంధీ చౌక్ దగ్గర పూర్తిగా నాసిరకంతో ధ్వంసమైన డివైడర్




గడ్డి కోసం డివైడర్‌పై ఎక్కిన పశువులు

నాసిరకం.. నగుబాటు!!

ఆదిలాబాద్ పట్టణ పరిధిలో చేపట్టిన డివైడర్ల నిర్మాణంలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. అశోక్ రోడ్డు, గాంధీ చౌక్ నుంచి ఠాకూర్ హోటల్ వరకు నిర్మించిన డివైడర్ పనుల్లో నాసిరకం కారణంగా పూర్తిగా ధ్వంసం అయ్యాయి. నిర్వహణ లోపం కారణంగా పిచ్చి మొక్కలు మొలవగా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఎక్కడికక్కడ పగిలిపోయి వారి నిర్వాకానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్





నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

నేడు రేషన్ కార్డుల పంపిణీ

తలమడుగు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో సుంకిడి రైతు వేదికలో నిర్వహిస్తున్న రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం జిల్లా కలెక్టర్ రాజార్షిషా, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తహసీల్దార్ రాజమోహన్ తెలిపారు. ఈ కార్యక్రమం మధ్యాహ్నం ఒంటిగంటకు నిర్వహించడం జరుగుతుందన్నారు. రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి లబ్ధిదారులు మండల ప్రజాప్రతినిధులు నాయకులు, అధికారుల సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. అంతేకాకుండా రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిరంత ప్రక్రియని ఎవరు ఆందోళన చెందవద్దని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు అందిస్తామని పేర్కొన్నారు.

8న సాముహిక వ్రతాలు

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ఈనెల ఎనిమిదిన పట్టణంలోని శ్రీ రామ చంద్ర గోపాల కృష్ణ మటంలో సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సాముహిక వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహిస్తున్నట్లు అర్చకులు ఓం ప్రకాష్ శర్మ తెలిపారు. మహిళలకు పూజ సామగ్రిని ఉచితంగా అందచేయడం జరుగుతుందని, కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సమితి అధ్యక్షులు ప్రమోద్ ఖత్రి, సభ్యులు పాల్గొన్నారు.

రాకపోకలకు అంతరాయం

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): విజయవాడ డివిజన్‌లో లైటీ బ్లాక్ కారణంగా ఆదిలాబాద్ నుంచి తిరుపతి వరకు నడిచే కృష్ణ ఎక్స్‌ప్రెస్‌ను కొద్దీ రోజులు రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నంబర్ 17406 ఆదిలాబాద్ నుంచి తిరుపతి నడిచే రైలు ఈనెల 8, 10, 12 తేదీల్లో రెండు గంటలు ఆలస్యంగా నడుస్తుందని పేర్కొన్నారు. రైలు నంబర్ 17405 తిరుపతి నుంచి ఆదిలాబాద్ నడిచే రైలు ఈనెల 13 నుంచి 19 వరకు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించి సహకరించాలని కోరారు.

> అవినీతి అక్రమాలకు.. పాల్పడుతూ అడ్డగోలు సంపాదనకు ఎగబడిన అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గత నాలుగైదు మాసాల క్రితం అదిలాబాద్ మునిసిపాలిటీలో ఆర్వోగా పని చేసిన యాదవ్ కృష్ణపై తాజాగా రాష్ట్ర ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేయడం అధికార వర్గాల్లో అలజడి రేపుతోంది.



● ఆదిలాబాద్ మునిసిపల్ కార్యాలయం

- గతంలో మునిసిపాలిటీ ఆర్వోగా పనిచేసిన జాదవ్ కృష్ణ పై సస్పెన్షన్ వేటు
- అడ్డగోలుగా ఫేక్ డోర్ నెంబర్లు, మునిసిపల్ స్థలాల కబ్జాలకు సహకారం
- అవినీతి అధికారుల అండతో కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములు మాయం
- రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ శాఖ అధికారుల్లోనూ మొదలైన గుబులు
- రాష్ట్ర ప్రభుత్వ చర్యలతో జిల్లా అధికార వర్గాల్లో కలకలం

బల్దియాలో.. అలజడి

ఆదిలాబాద్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో ఓపెన్ ప్లాట్లకు పేక్ డోర్ నెంబర్లు కేటాయిస్తూ విలువైన భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులపై జిల్లా పోలీసులు మే 16న కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. వీరికి సహకరించిన అప్పటి రెవెన్యూ అధికారి జాదవ్ కృష్ణపై ఆ శాఖ ఉన్నతాధికారులు పూర్తిస్థాయి విచారణ చేపట్టి వేటు వేశారు. జాదవ్ కృష్ణ ఉద్యోగోన్నతిపై ఆదిలాబాద్ మున్సిపాలిటీ నుంచి ఖానాపూర్ మునిసి పాలిటీ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. అక్కడ అవినీతి ఆరోపణలతో ఉన్నతాధికారులు ఆయనను సరెండర్ చేశారు. ఆ తర్వాత బోధన్ కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీలో రెవెన్యూ అధికారిగా పనిచేసిన సమయంలో అడ్డగోలుగా డోర్ నెంబర్ల కేటాయింపు అలాగే, ప్రభుత్వ భూముల అసైన్లపై వివరణ కోరతూ రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ ఉన్నతాధికారులు ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జిల్లాలో చర్చనీయంశంగా మారింది.


ఖాళీ జాగా కనిపిస్తే కథమే..

అదిలాబాద్ మున్సిపల్ పరిధిలో ఖాళీ జాగా కనిపిస్తే చాలు కబ్జాదారుల కన్నుపడి కనిపించకుండానే పోతున్నాయి. ఎవరికి అనుమానం రాకుండా రాత్రికి రాత్రే కబ్జా చేయడం ఆ తర్వాత నకిలీ ధ్రువ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవడం కొందరికి అలవాటుగానే మారింది. అదేవిధంగా జిల్లాకేంద్రంలోని బుక్తాపూర్ కాలనీలో 469.44 స్క్వేర్ యాడ్ స్థలానికి ఇంటి నెంబర్ 6636/2/1 గా కేటాయించి అదే కాలనీకి చెందిన సయ్యద్ అక్రమ్ విలువైన స్థలాన్ని ఆక్రమించుకునేందుకు తన సమీప బంధువైన సయ్యద్ షాబుద్దీన్ పై అక్రమంగా నకిలీ ధ్రువత్రాలను సృష్టించి గత 35ఏళ్లుగా నివాసముంటున్నట్లు అడ్డదారిలో రిజిస్ట్రేషన్ చేశారు. దీంతో మున్సిపల్ అధికారుల ఫిర్యాదుతో ఆదిలాబాద్ ఒకటవ పట్టణ పోలీసు లు అక్రమ్, షాబుద్దీన్‌లపై క్రైమ్ నెం.96/25తో పాటు అండర్ సెక్షన్ 329 (3), 318 (4), 336 (3), 340 (2) బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. అలాగే వీరికి సహకరించిన అప్పటి మున్సిపల్ ఆర్వో జాదవ్ కృష్ణపై విచారణ సైతం చేపట్టారు.

సర్వే నె.170 లోనూ అక్రమాలు

జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న సర్వే నెం. 170 లోను భారీగా అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ సర్వే నెం.లో ఓపెన్ ప్లాట్‌లకు అడ్డగోలుగా ఇంటి నెంబర్లను కేటాయించినట్లు జాదవ్ కృష్ణపై ఆరోపణలు వచ్చాయి. ఎలాంటి నిర్మాణాలు లేకపోయినా ఇంటి నెంబర్లను కేటాయించి విలువైన ప్రభుత్వ స్థలాలను అడ్డగోలుగా రిజిస్ట్రేషన్ చేయడంలో మున్సిపల్ రెవెన్యూ అధికారుల హస్తం ఉన్నట్లు తెలుస్తుంది. విలువైన ప్రభుత్వ స్థలాలు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లినట్లు అధికారుల విచారణలో తేలింది. దీనంతటికీ మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యమే అసలు కారణమంటున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగంలోనూ కొంత మంది అధికారులు అవినీతికి పాల్పడుతూ అడ్డగోలు నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారనే ఫిర్యాదులు వస్తున్నాయి. మున్సిపల్ పరిధిలో ని రెవెన్యూ , టౌన్ ప్లానింగ్ విభాగంలో అక్రమాలు అవినీతికి అడ్డూఅదుపు లేకుండా పోతుందన్న వాదనలు ఉన్నాయి. ఈ రెండు విభాగాలపై మరింతలోతుగా దర్యాప్తు జరిపితే అధికారుల

(తరువాయి 6వ పేజీలో....)



ఘనంగా ఫేర్ వెల్ డే

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో ఫేర్ వెల్ డే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. బుధవారం కళాశాలలో 2025 బ్యాచ్ విద్యార్థులకు వీడ్కోలు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమం అట్టహాసంగా సాగింది. జూనియర్లు సినీ గీతాలకు తగ్గట్లుగా నృత్యాలు చేస్తూ అలరించిన తోటి విద్యార్థులు కేరింతలు కొడుతూ ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఉన్నతంగా చదువుల్లో సమాజంలో మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. చదువుతోనే సమాజం గుర్తింపు ఉంటుందన్న విషయాన్నిగుర్తించాలన్నారు. సూపరింటెండెంట్ మమత, అధ్యాపకులు విజయలక్ష్మి, గంగామణి, ప్రియాంక, శివ కుమార్, సాగరిక, కమల్ కిషోర్, ప్రమోద్‌రెడ్డి పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో, అధికారులు

ముగిసిన సీఆర్‌టీల డెమో

ఉట్నూర్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలోని గిరిజన సంక్షేమ విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న కాంట్రాక్ట్ రెసిడెన్సి టీచర్ల (సీఆర్‌టీ) అభ్యర్థుల డెమో సజావుగా ముగిసింది. మండల కేంద్రంలోని కొమురం భీమ్ కాంప్లెక్స్‌లోని పీఎంఆర్‌సీ భవనంలో నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ సీఆర్‌టీల డెమో ప్రక్రియను పీవో ఖుష్బూ గుప్తా ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. 6 గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సీఆర్ టీ పోస్టులను భర్తీ చేసేందుకు డెమో నిర్వహించామని, దీనికి 96 మందికి 90 మంది హాజరయ్యారని ఆమె తెలిపారు. తుది జాబితా ప్రకటించి ఖాళీలలో నియామక ప్రక్రియ చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో డీడీ అంబాజీ జాదవ్, ఆసిఫాబాద్ డీడీ రమాదేవి పాల్గొన్నారు.



క్లినిక్‌లో తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

అర్హతకు మించి వైద్యం చేయరాదు

● డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఆర్ఎంపీలు అర్హతకు మించి వైద్యం చేయరాదని, పరిమితులకు లోబడి ప్రాథమిక వైద్యం అందించాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని పలు క్లినిక్‌లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రైవేట్ ఆస్పత్రులు నిర్వహిస్తున్న ఆర్ఎంపీలకు మూసివేయాలని నోటిసులు అందజేశారు. ఈ సందర్భంగా నలుగురు ఆర్ఎంపీలకు రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు. వైద్యాధికారులు సాధన, వైసీ శ్రీనివాస్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్ ఎమ్మెల్యే కార్యాలయ ప్రారంభం

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ క్యాంప్ కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు. తలమడుగు, తాంసి, భీంపూర్ మండలాలకు చెందిన ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు వీలుగా కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ విషయమై ఇటీవల జిల్లా కలెక్టర్ రాజర్షి షాను కలిసి కార్యాలయం ఏర్పాటుకు అనుమతితో పాటు భవనం ఇవ్వాలని కోరగా... స్పందించిన కలెక్టర్ పట్టణంలోని డీఆర్‌డీవో గెస్ట్ హౌజ్‌ను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం కోసం కేటాయించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్నతో కలిసి ప్రత్యేక పూజలు చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. బోథ్ లోని క్యాంప్ కార్యాలయానికి తలమడుగు, తాంసి, భీంపూర్ ప్రజలు, కార్యకర్తలు సమస్యలు తెలియజేయడానికి రావడం కష్టంగా మారడంతో జిల్లా కేంద్రంలో కార్యాలయం ఏర్పాటు చేయడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు.

తెలంగాణ ప్రజాయుద్ధ నౌక గద్దర్

ఉట్నూర్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజా యుద్ధ నౌక గద్దర్ వతిని పురస్కరించుకొని ఆయన చేసిన సేవలను టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ స్మరించుకున్నారు. బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ఆయువుపట్టుగా నిలిచిన వ్యక్తి గద్దర్ అని, ఆయనతో ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని ఈ సందర్భంగా సుగుణ గుర్తు చేసుకున్నారు. పేద కుటుంబంలో పుట్టి ఇంజనీరింగ్ విద్యను అభ్యసించిన గద్దర్ ఉన్నత కొలువుల వైపు దృష్టిసారించకుండా ప్రతిఒక్కరికి కూడు, గూడు, నీడ లభించాలనే లక్ష్యంతో జీవితాంతం తన పాటలతో ప్రజలను చైతన్యపర్చారని అన్నారు. గద్దర్ ఆశయాలను నెరవేర్చడానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర కన్వీనర్ సునీల్ జాదవ్, సంతోష్ జాదవ్, పరత్యాగ్ విశాల్, గెడాం శ్రీధర్, కనక సుదర్శన్, తిత్రే గోవింద్, వినోద్, శోభ పాల్గొన్నారు.



గద్దర్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సుగుణ

మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి

● మొక్కలు నాటిన కలెక్టర్ రాజర్షిషా ● బజార్‌హత్నూర్ మండలంలో వన మహోత్సవం ● పాల్గొన్న ఆయా శాఖల అధికారులు



బజార్‌హత్నూర్‌లో మొక్కలు నాటి నీరు పోస్తున్న కలెక్టర్



బంగారుగూడలో విద్యార్థులతో మాట్లాడుతూ..

బజార్‌హత్నూర్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. డీఆర్‌డీవో ఆధ్వర్యంలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మండలంలోని గిర్నూర్ గ్రామ శివారులో గల చెరువు కాలువపై బుధవారం అధికారులతో కలిసి కలెక్టర్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతీఒక్కరు విధిగా మొక్కలు నాటి వాటిని కాపాడుకోవాలన్నారు. ఈరోజు నాటిన మొక్కలే రేపటి తరాల అవసరాన్ని తీర్చుతాయన్నారు. అనంతరం చెరువు కాలువ పూర్తిగా బురదమయం కావడంతో రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, చారిత్రక కనకాయి జలపాతానికి వెళ్లేందుకు ఇబ్బందులను గిర్నూర్ గ్రామస్థులు వివరించడంతో పొలంబాట కార్యక్రమం ద్వారా రైతులు పొలానికి వెళ్లేందుకు రోడ్డు బాగు చేయించుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. అలాగే గిర్నూర్ గ్రామంలో అంగన్‌వాడీ భవనం బాగు చేయాలని, పిల్లలకు ఇబ్బందిగా ఉందనడంతో ప్రజా ఫిర్యాదుల విభాగంలో సమస్య తెలపాన్నారు. ఈ సందర్భంగా రేషన్‌కార్డుల అందజేత సమస్యలను పలువురు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా ఎప్పటికప్పుడు రేషన్ కార్డులను అందజే యాలని స్థానిక తహసీల్దార్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీడీ రవీందర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ హిమాశ్రీ, ఇన్‌చార్జి ఎక్సైజ్ ఎస్సై మురళీకృష్ణ, తహసీల్దార్ శ్యాంసుందర్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో మహేందర్‌రెడ్డి, ఏపీవో శ్రీనివాస్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

● బంగారుగూడ ప్రాథమిక పాఠశాల సందర్శన

ఆదిలాబాద్ రూరల్: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల బంగారుగూడలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో నిర్మాణ్ ఫౌండేషన్ సహకారంతో, బుధవారం విద్యార్థులకు బ్యాగులు, పాఠశాల పర్నిచర్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివేటువంటి పేద విద్యార్థులకు సదుపాయాలు కల్పించాలని ఉద్దేశంతో పాఠశాలలోని విద్యార్థులకు తాగునీరు శుద్ధి చేసే వాటర్ ప్యూరిఫైయర్ ఎస్‌బీఐ అధికారులతో కలిసి ప్రారంభించారు. అదేవిధంగా 155 స్కూల్ బ్యాగులు, 155 జతల స్కూల్ సూస్ పాఠశాలకు, ఒక మైక్ సెట్‌ను, వీటన్నింటితో పాటు 5 అల్మరాలు సైతం ఎస్‌బీఐ విరాళంగా ఇవ్వడం జరిగింది. అనంతరం కలెక్టర్ పాఠశాల తరగతి గదులను పరిశీలించారు. ఎస్‌బీఐ ఆర్ఎం గులుమూరు రామచంద్రరావు, ఆదిలాబాద్ బ్రాంచ్ మేనేజర్ సురేష్, ఎం.బాలకృష్ణ, మేనేజర్(మానవ వనరులు), హనుమాన్ ప్రసాద్, హెచ్‌ఆర్ అసోసియేట్, కోలేటి మహేశ్‌కుమార్, ఎడ్యుకేషనల్ మేనేజర్ నిర్మాణ్, ఆర్గనైజేషన్, ఎంఈవో సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్, అటవీ శాఖ అధికారులు

నాటిన మొక్కలను అందరూ కాపాడాలి

● బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు, నాటిన ప్రతీ మొక్కను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ అన్నారు. బుధవారం మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అటవీశాఖ అధికారులు నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు, అధికారులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ ఆనాటి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన హరితహార కార్యక్రమాన్ని ఈ ప్రభుత్వం వన మహోత్సవం పేరుతో ప్రారంభించడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే నాటిన మొక్కలను ప్రతి ఒక్క విద్యార్థులు దత్తతగా తీసుకొని కాపాడాలన్నారు. ఇందులో రాథోడ్ సజన్, రవీందర్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, నానక్ సింగ్, ఎఫ్ఆర్‌వో గణేష్, ప్రిన్సిపాల్ సభనా తర్జం, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

బోథ్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రతీ మహిళా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందని, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని, ఆ కుటుంబాలు అభివృద్ధిలో ఉంటాయని కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. బుధవారం సోనాల మండలంలోని కోట(కే) గ్రామంలో మదర్ పౌల్ట్రీ ఫామ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలను అన్ని రంగాల్లో తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రతీ మహిళ పొదుపును అలవాటు చేసుకున్నట్లయితే ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. తర్వాత డీఆర్డీఏ పీడీ రాథోడ్ రవీందర్ మాట్లాడుతూ ఈజీఎస్ కింద రూ.3 లక్షలు, పీఎం ఈజీఎస్ కింద రూ.5 లక్షలు ఈ పథకానికి కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్ ఏపీఎం బ్రదర్ సింగ్ ఎస్వీఈపీ మాధవ్, సీసీలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడంలో కీలకపాత్ర

● కలెక్టర్ రాజర్షి షా ● జిల్లావ్యాప్తంగా ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి ● నివాళులర్పించిన జిల్లా అధికారులు, నేతలు

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. జిల్లా అధికారులు, నేతలు, ప్రముఖులు ఆచార్య జయశంకర్ చేసిన సేవలు, పోరాటాలను గుర్తు చేసుకుంటూ ఘన నివాళి సమర్పించారు. ఇందులో భాగంగానే బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జయశంకర్ సార్ జయంతిని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించారు. ఇందులో కలెక్టర్ పాల్గొని జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్డీఓ స్రవంతి, బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజలింగు, డీఎస్‌వో వాజీద్ అలీ, విశ్వబ్రహ్మణ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి అన్ని పార్టీలు, అన్ని వర్గాలను ఏకం చేసి తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ప్రొఫెసర్ జయశంకర్ కీలకపాత్ర పోషించారని అన్నారు. బ్రహ్మచారిగానే ఉంటూ రాష్ట్ర సాధన కోసం తపించారని, ఆయన చేసిన సేవలను గుర్తించి ప్రభుత్వం అధికారికంగా జయంతి నిర్వహిస్తుందని తెలిపారు. అలాగే, పట్టణంలోని పోలిసు ముఖ్య కార్యాలయంలో జయశంకర్ జయంతి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అదనపు ఎస్పీ సురేందర్ రావు ముఖ్య అతిథిగా హాజరై.. జయశంకర్ చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించి నివాళి సమర్పించారు.



ఆదిలాబాద్‌లో నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు




ఉట్నూర్‌లో నివాళులర్పిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

అలాగే, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మాజీ మంత్రి జోగు రామన్న, మెట్టు ప్రహ్లాద్, యాసం నర్సింగ్ రావు, సేవ్వ జగదీష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, టీడీపీ ఆధ్వర్యంలోనూ సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇందులో నాగన్న, గంగారెడ్డి, మహేందర్, గంగమ్మ, అక్తర్ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు విశ్వబ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలోనూ జయంతిని ఘనంగా నిర్వహించారు.

● తెలంగాణ సాధన పోరాట స్ఫూర్తి ప్రధాత

ఉట్నూర్: తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాలలో అలుపెరగని పోరాటానికి స్ఫూర్తి ప్రధాత ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా అన్నారు. బుధవారం జయశంకర్ జయంతిని పురస్కరించుకుని ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వేడుకలలో పీవో పాల్గొని జయశంకర్‌కు నివాళులు అర్పించారు. ఇందులో ఏపీఓ(పీవీటీజీ) మెస్రం మనోహర్, ఏజెన్సీ అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి కుడిమేత మనోహర్, ఈఈ తానాజీ, పీహెచ్‌వో గుడిమల్ల సందీప్ కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

(మరిన్ని వివరాలు 6వ పేజీలో....)



అనుబంధాల.. ఆన్‌లైన్ రాఖీ

- విదేశాల్లోని సోదరులకు పంపేందుకు వీలు
- అందుబాటులో ఈ కామర్స్ పోర్టళ్లు
- ఆన్‌లైన్, పోస్టల్, కొరియర్ సేవల జోరు
- కాలానికనుగుణంగా రాఖీల్లో మార్పులు

వివరాలు 7వ పేజీలో....